క్లుప్తంగా

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

మాజీ సైనికుడికి సత్కారం



మాజీ సైనికుడు బాలరాజును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురంలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చిలకమర్రి కస్తూరి ఆధ్వర్యంలో వివిధ ప్రతిభావంతులను శనివారం ఘనంగా సత్కారించారు. కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు యనమదల బాలరాజును ఆయన స్వగృహంలో మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస వర్మ సత్కరించారు. వారు మాట్లాడుతూ సైనికులు దేశానికి చేసిన త్యాగం మరువలేనిది అని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కాపులకు రాజ్యాధికారం దక్కాలి



పాశర్లపూడి సమావేశంలో మాట్లాడుతున్న చినబాబు

మామిడికుదురు: కాపులకు రాజ్యాధికారం దక్కాలన్నదే కాపు సంక్షేమ సేన లక్ష్యమని రాష్ట్ర అధ్యక్షుడు బసవా చినబాబు పేర్కొన్నారు. పాశర్లపూడిలో నగరం ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కొండలరావు స్వగృహం వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాపు సంక్షేమ సేన వ్యవస్థాపకుడు చేగొండి హరిరామజోగయ్య ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు తిక్కా శేషుబాబు, సేన నేతలు కంకిపాటి నర్సింహారావు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని సన్నిధికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. అధిక శ్రావణంలో ఏకాదశి తిథి కలిసి రావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు తరలి వచ్చారు. స్వామి వారి సన్నిధిలో నిర్వహించే అభిషేకం, సుదర్శన హోమంలో భక్తులు పాల్గొని స్వామిని కొలిచారు. కాగా సాధారణ, ప్రత్యేక దర్శనాల ద్వారా సుమారు మూడు వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే స్వామి దర్శన అనంతరం నిత్యాన్నదాన పథకంలో వారికి అన్నప్రసాదం కల్పించినట్టు ఆయన చెప్పారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న సర్పంచ్



వెంకటలక్ష్మి దహన సంస్కారాల్లో పాల్గొన్న సర్పంచ్ చిట్టిబాబు

సఖినేటిపల్లి: పేద అవ్వ మృతదేహానికి సొంత ఖర్చులతో దహన సంస్కారాలు నిర్వహించి స్థానిక సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు మానవత్వం చాటుకున్న వైనమిది. శుక్రవారం స్థానిక లాకుపేటకు చెందిన బీదరాలు బొమ్మిడి వెంకటలక్ష్మి (72) అనారోగ్యంతో చనిపోయింది. వెంకటలక్ష్మికి అంత్యక్రియలకు కుటుంబ సభ్యులకు తగిన ఆర్థిక స్తోమత లేని కారణంగా సర్పంచ్ చిట్టిబాబు ఇందుకు చొరవ చూపారు. సఖినేటిపల్లి గోదావరి పాయకు సమీపాన శ్మశానవాటికలో దగ్గర ఉండి కుటుంబ సభ్యులతో కలసి వెంకటలక్ష్మి దహన సంస్కారాలు పూర్తి చేశారు.



బొబ్బర్లంక పొన్నాడలో నీట మునిగిన దేవాలయాల సమూహం



జి.పెదపూడి బూరుగులంకలో కోతకు గురవుతున్న లంక భూమి



కె.ఏనుగుపల్లిలో వరద ఉధృతిలో నడిచి వెళుతున్న యువతులు



నందంపూడి బొంతువారిపేటలో నీట మునిగిన ఇళ్లు

ఉరకలై గోదావరి..

- జలదిగ్బంధంలో గ్రామాలు
- ట్రాక్టర్ ద్వారా రాకపోకలు
- ముంపుబారిన పడిన రోడ్లు



బూరుగులంక రేవు వద్ద వరదనీటిలో ప్రయాణం



అప్పనపల్లిలో ముంపునకు గురైన రోడ్డుపై వరదలో దిగివస్తున్న ప్రయాణికులు



అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: గోదావరి తీరంలోని అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాలను వరద ముంచెత్తింది. పాశర్లపూడి ఏటిగట్టు దిగువన అప్పనపల్లి కాజ్‌వేపై మూడడుగుల మేర వరద పొంగి ప్రవహిస్తోంది. దీంతో ఈ మార్గంలో ట్రాక్టర్‌పై స్థానికులు రాకపోకలు సాగిస్తున్నారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన ఉచ్చులవారిపేట రోడ్డుపై పలు చోట్ల వరద పొంగి ప్రవహిస్తోంది. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దర్శనానికి వచ్చిన భక్తులను ఆలయానికి వెళ్లేందుకు అనుమతించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద ప్రభావిత అప్పనపల్లిలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పర్యటించారు. జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు పాశర్లపూడి ఏటిగట్టు దిగువన ముంపునకు గురైన అప్పనపల్లి కాజ్‌వేను పరిశీలించి వరద పరిస్థితిని సమీక్షించారు. ఇతర అధికారులు గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

అయినవిల్లి: మండలంలోని వీరవల్లిపాలెం, అయినవిల్లిలంక, పొట్టిలంక, తొత్తరమూడిలోని కె. పెదలంక, కొండుకుదురులంక, మడుపల్లిలంక, చింతనలంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలను వరద చుట్టుముట్టింది. ఈ గ్రామాల్లో ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముక్తేశ్వరం-అయినవిల్లిలంక వెదురుబిడెం కాజ్‌వే వద్ద, ముక్తేశ్వరం వృద్ధగౌతమి పాయ వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. పడవల సాయంతో వరద బాధితులను దాటిస్తున్నారు. నిత్యావసరాలు తెచ్చుకునేందుకు లంక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, వైద్య సిబ్బంది, మండల స్థాయి అధికారులు వరద సహాయక చర్యల్లో తల మునకలై పనిచేస్తున్నారు.

నీట మునిగిన ఇళ్లు

అంబాజీపేట: వైనతేయ గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో గ్రామాల్లో ఉండే కౌశికలు పొంగి పొర్లడంతో నందంపూడి, వాకలగరువు, తొండవరం గ్రామాల్లో ఇళ్లు, కొబ్బరి, అరటి, దొండ పాదులు నీట మునిగాయి. నందంపూడి బొంతువారిపేటలో ఇళ్లు నీట మునిగాయి. ఇళ్ల మధ్యకు వరద చేరింది. ఈ మూడు గ్రామాల్లో ఉన్న కొబ్బరి, అరటి తోటలను వరద ముంచెత్తింది.

సఖినేటిపల్లి: మండలంలోని అప్పనరామునిలంకలోకి వరద పోటెత్తింది. గ్రామంలోని రావూరిమెరక మినహా మిగతా ఏరియాల్లో వరద ప్రవహిస్తోంది. టేకిశెట్టిపాలెం ఏటిగట్టు నుంచి ప్రాథమికంగా తహసీల్దార్ వై.రామకుమారి ఏర్పాటు చేసిన పది పడవల్లో ఆయా ప్రాంతాల ప్రజలు బయటకు రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామస్తులు మలికిపురం మండలం రామరాజులంక మీదుగా ఇతర ప్రాంతాలకు వారు రాకపోకలు సాగిస్తున్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

పి.గన్నవరం: వశిష్ట, వైనతేయ నదీపాయల్లో వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని 9 లంక గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. వరద తగ్గక పోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు ఇప్పటికే బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కె.ఏనుగుపల్లి రహదారిపై మూడు అడుగుల వరద ప్రవహిస్తోంది. మానేపల్లి శివాయలంక, పల్లిపాలెం రహదారులపై వరదనీరు ప్రవహిస్తుండటంతో పడవలు ఏర్పాటు చేవారు. నాగుల్లంక శివారు గుడ్డాయలంక, ఎల్.గన్నవరం, మొండెపులంక, జొన్నల్లంక, వై.కొత్తపల్లి తదితర గ్రామాలను వరదనీరు చుట్టిముట్టింది. మొండెపులంక శివారు పుచ్చల్లంక రహదారి నీట మునిగింది. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, అనగర్లంక, అయోధ్యలంక, కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. బూరుగులంక రేవులో ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని ఏర్పాటు చేశారు. వరద తాకిడికి గురయ్యే తొమ్మిది గ్రామాల్లో 20 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వరద పరిస్థితిని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.భారతి వరద ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆయన పలు వరద ప్రాంతాల్లో పర్యటించారు.

ఉధృతంగా వరద

రావులపాలెం: మండలంలోని ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, గోపాలపురం, పొడగట్లపల్లి లంక ప్రాంతాల్లో పశువుల గడ్డి నీట మునిగింది. అలాగే దొండ, మిరప, వంగ తదితర కూరగాయలు తోటలు, అరటి, కంద లాంటి వాణిజ్య పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు చేసేది లేక నావలపై వెళ్లి చేతికి అందిన అరటి గెలను ఒడ్డుకు చేర్చి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అలాగే ఊబలంక శివారు తోకలంక చుట్టూ వరద చేరింది. దీంతో అధికారులు ప్రజల రాకపోకల కోసం నావలను ఏర్పాటు చేశారు. ఊబలంక పీహెచ్‌సీ వైద్య సిబ్బంది శనివారం మండలంలోని ఊబలంక శివారు తోకలంకలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీకాంత్, సూపర్ వైజర్ సామ్యూల్ రాజు, వైద్య సిబ్బంది తోకలంకకు నావలపై వెళ్లి స్థానిక ఎంపీపీ పాఠశాల వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.

ఆత్రేయపురం: మండలంలోని లంక ప్రాంతాల వెంబడి గౌతమీ గోదావరికి వరద పోటెత్తుతుంది. తాడిపూడి, వసంతవాడ, బొబ్బర్లంక, వెలిచేరు గ్రామాల్లోని లంక భూములు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోదావరి పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల స్థాయి అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లంక భూముల్లోకి చేరిన వరద

ఆలమూరు: మండలంలోని లంక గ్రామాల వెంబడి ప్రవహిస్తున్న గౌతమీ ఉరకలెత్తడంతో లంక భూములు వరద నీటిలో చిక్కుకున్నాయి. మూలస్థాన అగ్రహారంలోని లంక భూములు వరద నీటిలో చిక్కుకోగా అక్కడ పనిచేస్తున్న ఇటుక బట్టీ కార్మికులను పడవల సాయంతో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. బడుగువానిలంకలోని అన్ని వైపుల ఉన్న గయ్యాలీ, పాగరుబోతు, చెముడులంక పాయల్లో వరద నీరు నిలకడగా ఉంది. జొన్నాడలో రెండు వంతెనల వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహించడంతో పుష్కరాల రేవు, దేవదాయ సమూహం శ్మశానవాటిక నీట మునిగాయి. అధికారులు లంక ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు

కలెక్టర్ హిమాన్షు శుక్లా

పి.గన్నవరం/మామిడికుదురు: వరద ముంపు గ్రామాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. మండలంలోని వరద తాకిడి గ్రామాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో వరద తాకిడికి గురయ్యే లంక గ్రామాల్లో 40 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. అక్కడే వరద బాధితులకు భోజన తయారు చేసి, అందించేలా ఏర్పాటు చేశామన్నారు. ఎల్.గన్నవరంలో అసంపూర్తిగా వదిలేసిన ఏటిగట్టును ఎత్తు చేయాలని సర్పంచ్ పసలపూడి రామకృష్ణ కలెక్టర్‌ను కోరగా, సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నాగుల్లంకలో రైతు బజార్‌ను కలెక్టర్ శుక్లా ప్రారంభించారు. కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి, మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ ఎం.భారతి, సర్పంచ్‌లు నూకపెయ్యి ప్రసన్నకుమార్, యల్లమెల్లి కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటాం

వరద బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఆయన శనివారం అప్పనపల్లి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. ముంపు సమస్యను ఎదుర్కొంటున్న అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో బాధితులకు అందుబాటులో ఉండే విధంగా రైతు బజార్లు ఏర్పాటు చేసి కూరగాయలు అందుబాటులో ఉంచుతామన్నారు. జిల్లా వరద తాకిడికి గురయ్యే 60 గ్రామాల్లో 61 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని డీఎం అండ్ హెచ్ఓ ఎం.దుర్గారావుదొర తెలిపారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



కమ్మిరెడ్డిపాలెం మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అంబాజీపేట: త్యాగానికి, దైవత్వానికి ప్రతీక అయిన మొహర్రంను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. అంబాజీపేటలో శనివారం మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మసీదులో ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం స్థానిక కబరిస్తాన్ వద్దకు ర్యాలీగా వెళ్లి పెద్దల ఆత్మకు శాంతి చేకూరాలని దువా చేశారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ రఫీ, ఎండీ.సురాజ్, ఎండీ ఇస్మాయిల్, ఎస్.కరీం, పాషా తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: మహ్మద్ ప్రవక్త మనవళ్లు హసన్, హుస్సేన్ బలిదానానికి ప్రతీకగా ఈ పవిత్రమైన మొహర్రం పండగను జరుపుకొంటామని కమ్మిరెడ్డిపాఎలం మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ కాజా బాబు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పదిరోజుల ప్రార్థనల అనంతరం 11 వ రోజు పవిత్ర మొహర్రం సందర్భంగా అందరూ మసీదులకు వెళ్లి ప్రార్థనల్లో పాల్గొన్నారు. షేక్ కాజాబాబు, ఇంతియాజ్ అహ్మద్ తదితరులు ముస్లిం పెద్దలకు ఘన నివాళులర్పించారు. అల్లా మార్గంలో అమరులు కావడం సాధారణ విషయం కాదన్నారు. ప్రతి ఒక్కరూ నమాజ్ ఆచరించాలని అప్పుడే సన్మార్గం అలవడుతుందన్నారు. రాత్రి అందరూ సహపంక్తి భోజనం చేశారు.

బాధితుడికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ చెట్టు మీద నుంచి పడిపోయి వెన్నెముక విరిగి పోవడంతో మంచాన పడిన బాధితుడికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.16 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సేవా సమితి సభ్యులు శనివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రాజమహేంద్రవరం రూరల్ మండలం పిడింగొయ్యికి చెందిన కాకి భీమేశ్వరరావు ప్రమాదవశాత్తూ చెట్టు మీద నుంచి పడిపోవడంతో వెన్నెముక విరిగిపోయింది. వైద్యం చేయించుకునే స్తోమత లేక తల్లిపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇతను ఇతర కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. దీంతో సాయం కోరుతూ సేవా సమితి సభ్యురాలు వరలక్ష్మిని కోరారు. దీంతో స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.16 వేలు నగదు సాయంగా అతని ఇంటికి వెళ్లి అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

మామిడికుదురు: గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా మంజూరైన నిధులు రూ.14 లక్షలతో పెరళ్లకాలువ ప్రాంతంలో నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ రోడ్డుకు మామిడికుదురు సర్పంచ్ గొస్ మొహిద్దీన్ శనివారం శంకుస్థాపన చేశారు. సరెళ్ల గంగారత్నం ఇంటి నుంచి ఖాదం హుస్సేన్ ఇంటి వరకు 240 మీటర్ల మేర రూ.14 లక్షలతో సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నయినాల సత్యమూర్తి, అప్పన రామకృష్ణ, బత్తుల శ్రీను, పంచాయతీ కార్యదర్శి పీవీఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసిమాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరు గోశాలలో భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు. చింతలూరులో ఆలయ మండపంలో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక, భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

అభివృద్ధి ప్రదాతకు అండగా నిలవండి



మాచవరంలో లబ్ధిదారులకు పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన అభివృద్ధి ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మాచవరం మెట్లకాలనీలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజుల ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లో గడపగడపకూ కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ప్రతి గ్రామంలోనూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ 98 శాతం అమలు చేసిన జగనన్నను మరోసారి సీఎం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సంతోషంగా చెబుతున్నారన్నారు. నాగరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఘనస్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షులు దొమ్మేటి సత్యమోహన్, బొంతు శ్రీను, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, కొర్లపాటి కోటబాబు, కుసుమ శ్రీను, అప్పన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తదితరులు

మలికిపురం: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ప్రధాన ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు గతంలో ఏ ప్రభుత్వం కూడా అందించని విధంగా సంక్షేమ పథకాలను ప్రస్తుత జగన్ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని పార్టీ కార్యకర్తలు తిప్పికొట్టాలను పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చెవ్వాకుల సుందరరావు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే రాపాక పార్టీ కండువా వేశారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మండల అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీరావు, యువ నాయకుడు రాపాక వెంకటరామ్, ఎంపీటీసీ గుబ్బల గౌరీ వెంకట పద్మావతి, సొసైటీ చైర్మన్ చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు, పెయ్యల చిట్టిబాబు, వీఆర్వో తోట విస్సు, కార్యదర్శి రేకపల్లి ఏసుబాబు, వీఓఏ గుబ్బల రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

రూ.32 కోట్లతో రోడ్ల నిర్మాణం

అంబాజీపేట: కేంద్ర రహదారుల మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి పి.గన్నవరం నియోజకవర్గంలో రూ.32 కోట్లతో 18.765 కిలోమీటర్ల మేర 5 రహదారులు నిర్మిస్తున్నట్లు ఆర్అండ్‌బీ డీఈ జి.రాజేంద్ర తెలిపారు. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయన్నారు. అంబాజీపేట సెంటర్ నుంచి పి.గన్నవరం, అంబాజీపేట నుంచి పుల్లేటికుర్రు, పి.గన్నవరం నుంచి బెల్లంపూడి, వైటీ పాలెం నుంచి నరేంద్రపురం, ముక్కామల లాకుల నుంచి మడుపల్లి వరకు రహదారులను త్వరలో నిర్మిస్తామని రాజేంద్ర వివరించారు.

కుక్కల దాడి: ఇద్దరు చిన్నారులకు గాయాలు

రాజోలు: బి.సావరంలో కుక్కల గుంపు దాడిలో శనివారం ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. స్థానిక సిద్ధార్థ నగర్‌కు చెందిన సఖిలే స్మైలీ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా ఐదు కుక్కలు గుంపుగా వచ్చి స్మైలీ భుజం పట్టుకుని ఈడ్చుకుపోయాయి. దీంతో స్థానికులు కర్రలతో కుక్కల గుంపును చెదరగొట్టడంతో స్మైలీని విడిచిపెట్టాయి. ఇంతలోనే ఆ కుక్కల గుంపు శోభనా స్కూలు వీధికి చెందిన జయ అశ్విన్‌పై దాడి చేశాయి. స్మైలీ, జయ అశ్విన్‌లను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తీసుకుని రాగా వైద్యులు చికిత్స చేశారు. చిన్నారులకు ఎంటీ ర్యాబిస్ ఇంజక్షన్లు చేశారని, 24 గంటల పాటు చిన్నారులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలని సూచించారని బంధువులు తెలిపారు.

పీఏసీఎస్ చైర్మన్ రవీంద్రకు పితృవియోగం

రావులపాలెం: మండలంలోని పొడగట్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్ కొప్పాడి రవీంద్ర తండ్రి సూర్యనారాయణ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూర్యనారాయణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి రవీంద్ర కుటుంబ సభ్యులను పరామర్శించారు.

టీడీపీ మహాశక్తి చైతన్య యాత్ర

కొత్తపేట: మండలంలోని అవిడి గ్రామంలో టీడీపీ మహాశక్తి చైతన్య యాత్ర కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ మహిళల ఆధ్వర్యంలో జరుగుతున్న మహాశక్తి చైతన్య యాత్రలో మాజీ ఎమ్మెల్యే ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మహానాడులో ప్రకటించిన భవిష్యత్‌కు గ్యారంటీ పథకాలను, మహిశక్తి ద్వారా మహిళల పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ప్రదర్శన

మామిడికుదురు/రావులపాలెం: మణిపూర్ మారణకాండను నిరసిస్తూ శనివారం రాత్రి మామిడికుదురులో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా, అంగన్‌వాడీ, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు. మణిపూర్ మారణకాండను నిరసిస్తూ నినాదాలు చేశారు.